పత్తాలేని ఫాగింగ్..



మల్కాజిగిరి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మురికినీరు



- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు
- బస్తీలు, కాలనీ వాసుల అవస్థలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో దోమల బెడద నానాటికి తీవ్ర మవుతోంది. రాత్రి వేళల్లో కంటి మీద కునుకు ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. 15 రోజులకు ఒకసారైనా ఫాగింగ్ చేయాల్సిన ఎంటమాలజీ విభాగం కొన్ని ప్రాంతాల్లో నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై క్షేత్ర స్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేయాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

డంపింగ్ యార్డులుగా ఖాళీ స్థలాలు

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు చెత్తాచెదారానికి నిలయాలుగా మారుతున్నాయి. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు మురికి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎంటమాలజీ విభాగం అధికారుల లెక్కల ప్రకారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఆరు డివిజన్లకు సంబంధించి ఆరు ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. గౌతంనగర్‌లో ఫాగింగ్ యంత్రం లేకపోయినా పట్టించుకునేవారు కరు వయ్యారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

కంటి మీద కునుకు లేకుండా పోతోంది...



గౌతంనగర్, మల్లికార్జుననగర్, వాణినగర్, ఇందిరా నెహ్రూనగర్, మల్కాజిగిరి రైల్వే స్టేషన్ ప్రాంతంలో దోమలు విజృంభిస్తున్నాయి. చీకటి పడితే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలి.

మాశెట్టి అనిల్, వాణినగర్



ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న ప్రజలు

నిరీక్షణకు స్వస్తి

12 నుంచి ఉప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం

ఉప్పల్: ఉప్పల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుంది. రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే రోజంతా వృథా అయ్యేది. ఇకపై ఆ ఇబ్బందులు ఉండవు. పారదర్శకత, సత్వర సేవలను అదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ ప్రక్రియ సత్ఫలితాలు ఇవ్వడంతో మరి కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దీనిని అమలులోకి తేనున్నారు. దీంతో రోజంతా నిరీక్షణకు స్వస్తి పలకనుంది.

12 నుంచి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లు

ఉప్పల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి స్లాట్ పద్ధతిన రిజిస్ట్రేషన్‌లు అమలులోకి రానున్నందున ఉప్పల్ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి అదంగా మరో రిజిస్టార్‌ను కేటాయించనున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప్పల్ సబ్ రిజిస్టార్ విజయ జ్యోతి తెలిపారు.

రోజుకు 96 స్లాట్‌లు...

ప్రతిరోజు 48 చొప్పున ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లకు 96 స్లాట్‌ల వరకు బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ విజయ జ్యోతి తెలిపారు. మొదటి రోజు కొంత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న నేపథ్యంలో తమ సిబ్బంది వినియోగదారులకు సహకారం అందిస్తారన్నారు. 96 కన్నా ఎక్కువ డాక్యుమెంట్లు ఉంటే పరిస్థితులను బట్టి నాలుగు నుంచి ఐదు వరకు నేరుగా రిజిస్ట్రేషన్లను చేయడానికి వీలు ఉంటుందన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు కేటాయించిన సమయంలో విధిగా హాజరు కావాలని లేని పక్షంలో స్లాట్ రద్దు అవుతుందని తిరిగి బుక్ చేసుకోవాల్సి వస్తుందన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో | రెండేళ్ల జైలు, రూ.14.2 లక్షల జరిమానా

కుషాయిగూడ: చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.14.20 లక్షల జరిమానా విధిస్తూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. బాధితురాలు పసుపుల స్వప్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాప్రా, శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆలకుంట లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వద్ద పసుపుల స్వప్న 2018లో 320 గజాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు రూ.40 లక్షలతో బేరం కుదుర్చుకుంది. అందుకు గాను రూ.5.20 లక్షలు అడ్వాన్సుగా చెల్లించింది. గడువులోగా మిగతా డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని భావించింది. అయితే సదరు ఫ్లాట్ లక్ష్మీనారాయణ పేరుపై లేదని తెలియడంతో బాధితురాలు ఈ విషయాన్ని పెద్ద మనుషుల దృష్టికి తీసుకెళ్లింది. ఆ సమయంలో కొంత మొత్తం చెల్లించిన లక్ష్మీనారాయణ మిగతా రూ.12.50 లక్షలకు గాను చెక్కులు ఇచ్చాడు. పెద్ద మనుషులు ఇచ్చిన గడువు ముగిసినా డబ్బులు చెల్లించక పోవడంతో బాధితురాలు కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో చెక్‌బౌన్స్ కేసు పెట్టింది. కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి ఆధారాలను కోర్టు ముందుంచారు. సుదీర్ఘ విచారణ అనంతరం నిందితుడు లక్ష్మీనారాయణకు రెండేళ్ల జైలుశిక్ష రూ. 14.20 లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు బాలాజీ హిల్స్, రాజశేఖర్ కాలనీ, సూర్యహిల్స్, నవోదయ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఈదయ్యనగర్, హేమానగర్, పద్మావతి కాలనీ, వెస్ట్ బాలాజీ హిల్స్, న్యూరాంనగర్, మెక్‌డల్ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా...

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు శ్రీసాయి భవానీ కాలనీ, శ్రీసాయిరాంనగర్, శ్రీనివాస్ కాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, బృందావన్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ వెల్లడించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు సరస్వతీ నగర్, విజయపురి కాలనీ, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్, వివేకానందనగర్, ఎస్‌బిఎన్ కాలనీ, గ్రీన్‌సిటీ కాలనీ, సుభాస్ నగర్, మనసానినగర్, రాంరెడ్డినగర్, మారుతీనగర్, టెలిఫోన్ కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, ఆర్‌ఎస్‌ఎస్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, భీంరెడ్డి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండన్నారు.

మేడిపల్లి: 11 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం3.00 గంటల నుంచి 5.00 గంటల వరకు పీఅండ్‌టీకాలనీ, బుద్ధానగర్,వరంగల్ హైవేలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- 11 కేవీ చెన్నారెడ్డి తోట ఫీడర్ పరిధిలోని 33/11 కేవి పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 నుంచి 4.30 గంటల వరకు రాఘవేంద్ర నగర్,మల్లికార్జున నగర్,అరోరా పీజీ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.
- 33/11 కేవి చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.00 గంటలవరకు జైశ్రీరాం కాలనీ,కనకదుర్గా నగర్,అణుశక్తి నగర్, సిరిపురం కాలనీ.గాంధీ నగర్, పెద్దమ్మగుడి ఏరియాలో కరెంటు నిలిపివేయనున్నారు.
- 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు పీఅండ్ టీకాలనీ,కమలానగర్, సుమ రెసిడెన్సి, గురు ఎన్‌క్లేవ్ అయోధ్య కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.
- 33/11 కేవి చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం9.00 నుంచి 11.00 గంటల వరకు సాయి రెసిడెన్సి, వెంకటాద్రి నగర్, ఆదర్శ్ నగర్.ఆర్ఆర్ నగర్,ఆర్టీసీ కాలనీలలో కరెంటు నిలిపివేయనున్నట్లు ఏఈ హరినాథ్ ఓ ప్రకటనలో తెలిపారు.

కళ్యాణపురి ఫీడర్ పరిధిలో..

మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నిఖిల్ నర్సింగరావు తెలిపారు. జాహీద్ నగర్, బ్యాంక్ కాలని, టీచర్స్ కాలనీ, ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, సీతారామ కాలనీ, ఈస్ట్, నార్త్ కళ్యాణపురి, బాలాజీ ఎన్క్లేవ్, రాఘవేంద్రా కాలని అజమ్మత్ నగర్ విసాసత్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సైన్యానికి అండగా నిలవాలి



మాట్లాడుతున్న మౌలాలి కార్పొరేటర్ సునీతశేఖర్ యాదవ్

మౌలాలి : పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ త్రివిధ దళాలతో పాటు కేంద్ర ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటించాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మీడియాతో మాట్లాడుతూ తరచూ దాడులకు తెగబడుతున్న పాకిస్తాన్‌కు సరైన రీతిలో బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచ పటంపై నుంచి చెరిపివేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు తెలిపారు. ఇటువంటి విపత్కర సమయంలో దేశ ప్రజలంతా ఒక్క తాటిపై నిలబడి సరిహద్దులో పోరాడుతున్న సైన్యంలో ఆత్మవిశ్వాసం నింపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీష్‌యాదవ్, శివగౌడ్, వెంకటేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు



అల్వాల్ బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


కుషాయిగూడ: పాకిస్థాన్ ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ శుక్రవారం కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వుప్పల యాదగిరిరెడ్డి, ఈఓ వీరేశం, అర్చకులు రమణ పంతులు, వేణు పంతులు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని కోరుతూ అల్వాల్ లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత సైన్యానికి ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని వారు విజయంతో నిలవాలని కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

అల్వాల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వెంకటాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన విధంగా బుద్ధి చెప్పే అవకాశం భారత సైన్యానికి వచ్చిందన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, యాదగిరి, సూర్య కిరణ్, దేవేందర్, రఘు, భాస్కర్, నాగేశ్వరరావు, రాజసింహారెడ్డి, లక్ష్మణ్ , సంతోష్ రెడ్డి ,వీనస్ మేరీ, బబిత , శకుంతల నాయుడు, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కానిస్టేబుల్ సందీప్‌కు ఘన నివాళి

కీసర: ఛత్తీస్‌ఘడ్‌లో నక్సలైట్ల మందుపాతరకు ఘట్‌కేసర్‌కు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ మృతి చెందడం బాధాకరమని కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కీసరలో సందీప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంచాల పెంటయ్య, నాయకులు కట్ట శంకరయ్య, గుర్రం శ్రీధర్‌రెడ్డి, బంటు శ్రీనివాస్, ఎర్ర సాయిలు, ఎంకిరాల నర్సింగ్‌రావు, తుడుం ఆగమయ్య, రాకేష్, సుమన్, శ్రీరాములు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



బోరు పనులను ప్రారంభించిన బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: కుషాయిగూడ గ్రామంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె కుషాయిగూడ బస్టాండ్ బోర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుషాయిగూడ గ్రామ అవసరాలతో పాటు, హనుమాన్ విగ్రహ నిర్మాణానికి, శ్మశానవాటికకు అవసరమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో బోరు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చల్ల ప్రభాకర్, స్థానికులు బత్తుల శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. చెరువు కట్టపై నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనులు పూర్తయితే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్ రెడ్డి, ఆదిత్య, పాపిరెడ్డి, శ్యామ్, శర్మ, ఆకారం సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



మేడిపల్లి: మేడిపల్లి మండల లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వేముల కేశవ నాథం గౌడ్ ఆధ్వర్యంలో తల్లం ప్రణయ్ పుట్టినరోజు సందర్భంగా డిలైట్ చారిటబుల్ ట్రస్ట్‌కు శుక్రవారం బియ్యం , నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో లయన్ వేముల నాథం గౌడ్, అధ్యక్షుడు పల్లె బాల్ రాజ్ గౌడ్, మహేందర్ రావు, లయన్ శారద,సావిత్రి,రవీందర్ రెడ్డి,ప్రభాకర్,సందీప్, క్రిష్ణ స్వామి, ఫౌండర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర మహిళా మండలి 60 ఏళ్ల వేడుక

అల్వాల్: మహిళల అభ్యున్నతి కోసం ఏర్పడిన అల్వాల్‌లోని వేంకటేశ్వర మహిళా మండలి 60 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవుని అల్వాల్‌లోని మండలి కార్యాలయం వద్ద శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మహిళా మండల ప్రతినిధి చెంగల్వ కామేశ్వరి తెలిపారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరచిన మహిళలను సత్కరించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, మహిళా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

శాంతివనం ఫిట్‌నెస్ గ్రూప్ ఆధ్వర్యంలో పాదయాత్ర



ఉప్పల్: భారత ప్రభుత్వం పాకిస్తాన్ ముష్కరులకు బుద్ధి చెప్పేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం శాంతివనం ఫిట్‌నెస్ గ్రూప్ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి మేడిపల్లి శ్రీ యాదగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో వాకిటి శ్రీకాంత్ రెడ్డి, రాజ రాజు, కేసిరెడ్డి భవన్ రెడ్డి, విజయ్ రెడ్డి, సదానందం, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాండు, రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి జయంతి ఉత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీనర్సింహస్వామినగర్‌లోని స్వయంభూ శ్రీ జయగిరి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో శనివారం, ఆదివారం స్వామి వారి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు స్వామివారి అభిషేకం, 11 గంటలకు శ్రీసుదర్శన లక్ష్మీనర్సింహ హోమం, ఆదివారం ఉదయం 11 గంటలకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

కుషాయిగూడ: నిరుద్యోగ యువతీ, యువకులకు గన సొసైటీ, రాడిసన్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం రంగంలో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి జి. హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల ఇంటర్ పాస్ అయి 18–27 ఏళ్లలోపు యువతీ యువకులు ఈసీఐఎల్‌లోని గన సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90307 77192, 88855 12035 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

అల్వాల్: కిమ్స్ ఫౌండేషన్ టీం, విమలాకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అల్వాల్‌లో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మొబైల్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిసర ప్రాంతాల వాసులు ఉదయం 11 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు ఈ సందర్భంగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఇంటర్నల్ మెడిసిన్, జీర్ణవ్యవస్థ కేన్సర్ స్క్రీనింగ్ తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జెరుసలేం మత్తయ్యకు పరామర్శ

ఉప్పల్: శస్త్ర చికిత్స చేయించుకుని ఉప్పల్ టీఎక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రైస్తవ నాయకుడు జెరుసలేం మత్తయ్యను శుక్రవారం మాజీ ఉప ముఖ్యమంత్రి తాటి కొండ రాజయ్య పరామర్శించారు. ఆయన త్వరలో కోలుకుని సమాజ సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు.

మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి కన్నీటి వీడ్కోలు






శ్రద్ధాంజలి ఘటిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రి శ్రీధర్ బాబు

ఉప్పల్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బండారి రాజి రెడ్డి పార్థివ దేహాన్ని శుక్రవారం పలువురు రాజకీయ నేతలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున సందర్శించి నివాళులర్పించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరి రెడ్డి, మాజీ రాజ్య సభ సభ్యులు కేవీపీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ తదితరులు రాజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి ఘన నివాళి

కుషాయిగూడ: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతికి పలువురు నివాళులు అర్పించారు. శుక్రవారం ఆయన అంతిమ యాత్ర హెచ్‌బీకాలనీ, ఈసీఐఎల్, చక్రీపురం మీదుగా సాగింది. దారి పొడవునా ఆయన అభిమానులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

ముంపు సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కి వినతిపత్రం అందజేస్తున్న కమలాలయ కాలనీవాసులు

అల్వాల్: వర్షం కురిసిన ప్రతిసారి కాలనీ ముంపనకు గురవుతున్న నేపథ్యంలో మస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమలాలయ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం డివిజన్ పరిధిలోని కమలాలయ కాలనీలో వరద నీటి కాలువ నిర్మాణం లేక పోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి కాలనీ ముంపునకు గురవుతుందన్నారు. బాక్స్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్ కాలనీవాసులు వినోద్ కుమార్, శర్మ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉప్పల్: వడ దెబ్బ తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(40)ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.